ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 12.01.2026 సమయం : 1810 గంటలు

ముఖ్యాంశాలు

1. జిల్లాల పునర్విభజన కోసం త్వరలోనే రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2. స్వామి వివేకానందుడి స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు.

3. పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్ ను ఉపసంహరించుకుంటున్నట్లు సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

4. మున్సిపల్ ఎన్నికల్లో సర్వేల ఆధారంగా అభ్యర్థులకు బీఫామ్‌లు ఇస్తామని టిపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.

-----------------------------------

**సీఎం - జిల్లాల పునర్విభజన**

జిల్లాల పునర్విభజన కోసం త్వరలోనే రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ 2026 డైరీ, క్యాలెండర్ ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కమిటీ రాష్ట్రమంతటా పర్యటించి అభిప్రాయాలు స్వీకరిస్తుందన్నారు. ఆరు

మాసాల వ్యవధిలో నివేదిక ఇవ్వాలని కమిటీని కోరునున్నట్లు చెప్పారు. గతంలో నాయకులు తమకు నచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేశారని అన్నారు. జిల్లాల సరిహద్దులను మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, మండలాలు, రెవెన్యూ డివిజన్లను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సారధులు, వారధులు ఉద్యోగులేనని, సంక్రాంతి కానుకగా కరవు భత్యం చెల్లింపులకు ఆదేశాలు జారీ చేశారు.

( డెస్క్)

---------------------------------

**బండి సంజయ్ – కరీం నగర్**

స్వామి వివేకానందుడి స్ఫూర్తితో దేశం కోసం పనిచేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ యువతకు పిలుపునిచ్చారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని కళాభారతిలో జరిగిన జాతీయ యువజన దినోత్సవంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. భారత దేశ ఖ్యాతిని ఖండాంతారాలు దాటించడమే కాకుండా భారతీయ సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఆయన స్ఫూర్తితో నేటి తరం యువత ముందుకు సాగాలన్నారు. స్మార్టు ఫోన్లు, వైఫై ముఖ్యం కాదని ప్రశ్నించే ధైర్యాన్ని నింపుకొని, అన్యాయాన్ని ఎదిరించే భావి భారత పౌరులుగా దేశ సేవకు అంకితం కావలసి ఉందన్నారు. యువతకు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నందున సమాజంలోని చెడుకు దూరంగా, వికసిత్ భారత్ లక్ష్యానికి చేరువగా యువత భారతీయ సమాజాన్ని జాగృతం చేయవలసి ఉందన్నారు.

**బైట్ - బండి సంజయ్**

**( పిటిసి - కరీంనగర్)**

---------------------------------

**ఖమ్మం – తుమ్మల**

పంటలకు అధిక మోతాదులో యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని

రైతులకు సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు.

**( పిటీసీ - ఖమ్మం)**

--------------------------------

**రేవంత్ రెడ్డి – దివ్యాంగులు**

దివ్యాంగులు సమాజంలో ఆత్మ గౌరవంతో నిలబడేలా తమ ప్రభుత్వం మానవీయ కోణంలో తోడ్పాటునందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా భవన్ లో జరిగిన కార్యక్రమంలో బాల భరోసా పథకం, ప్రణామ్ వృద్ధుల డే కేర్ సెంటర్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్బంగా 50 కోట్ల విలువైన ఉపకరణాలను దివ్యాంగులకు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... విద్యా ఉద్యోగాల భర్తీలో దివ్యాంగులకు వారి కోటాను కేటాయించడం జరుగుతందని అన్నారు. క్రీడల్లో కూడా దివ్యాంగులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన పక్షంలో వారి జీతంలో 10 శాతం తల్లిదండ్రులకు అందించే విధంగా చట్టం తెస్తామని అన్నారు.

**బైట్ - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**డెస్క్**

-----------------------------------

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్ ను ఉపసంహరించుకుంటున్నట్లు సాగు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఈ రిట్ పిటిషన్ పై ఈ రోజు సుప్రీంకోరటులో విచారణ జరిగింది. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూచన మేరకు రిట్ పిటిషన్ ను ఉప సంహరించుకుంటున్నట్లు వెల్లడించారు. ఆర్టికల్ 131, సివిల్ సూట్ రూపంలో కోర్టు ముందుకు

రావాలని సీజేఐ సూచించారని ఆయన వెల్లడించారు. ఈ రిట్ పిటిషన్ పై తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు.

**డెస్క్**

-----------------------------

**హరీశ్ రావు - హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ప్రయోజనాల కోసం తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్ ఉపసంహరించుకోవడం ద్వారా ఏపీకి ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకునేందుకు సమయం ఇచ్చారని అన్నారు. అభిషేక్ మను సింఘ్వీ వంటి సీనియర్ న్యాయవాదులు ఉండి కూడా విచారణకు అర్హత లేని పిటిషన్ ఎందుకు వేశారని ప్రశ్నించారు.

**( పిటీసీ - హైదరాబాద్)**

------------------------------

**టిపిసిసి చీఫ్ - నిజామాబాద్**

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సర్వేల ఆధారంగా అభ్యర్థులకు బీఫామ్‌లు ఇస్తామని టిపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలుచుకున్నామని, జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి చేర్చ వలసిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులదేనని అన్నారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు త్వరలో ప్రారంభం కానుందన్నారు. నిజామాబాద్ జిల్లాకు మరో రెండు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఓట్ల రూపంలో మారనుందని వివరించారు.

(పిటిసీ - నిజామాబాద్)

-----------------------------------

**సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025**

సీఎం కప్ 2025 గ్రామ, మండల స్థాయి పోటీల నిర్వహణలో ఎలాంటి మార్పులు లేవని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలు ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు, జిల్లాస్థాయి పోటీలు ఫిబ్రవరి 9 నుండి 12 వరకు, రాష్ట్రస్థాయి పోటీలు ఫిబ్రవరి 20 నుండి 23 వరకు నిర్వహింపబడుతాయని పేర్కొంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా అన్ని జిల్లాల డివైఎస్ఓ లకు విజ్ఞప్తి చేసింది.

(ఎంఎస్ఎం )

------------------------

**సీఎం - మేడారం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లోని తన నివాసంలో మేడారం మహా జాతర పోస్టర్, బ్రౌచర్ ను ఆవిష్కరించారు. ఈ నెల 28 నుంచి జరిగే జాతర ఏర్పాట్లపై మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 19 నుంచి జరిగే జోగులాంబ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రిని అహ్వానిస్తూ ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ ఈవో, అర్చకులు ముఖ్యమంత్రికి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

డెస్క్

---------------------------

**ప్రత్యేక రైళ్లు...**

సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో విశాఖ - విజయవాడ మధ్య 12 జన్‌సాధారణ్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ రోజు నుంచి నెల 18 తేదీ వరకు ఈ రైళ్లను నడపనున్నట్లు తెలియచేసింది. విశాఖ - విజయవాడ జన్‌సాధారణ్ ఎక్స్‌ప్రెస్ రైలు

నిర్ణీత తేదీల్లో విశాఖలో ఉదయం 10 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకోనుందని. తిరిగి, విజయవాడ - విశాఖ ప్రత్యేక రైలు విజయవాడలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి రాత్రి 12 గంటల 35 నిమిషాలకు విశాఖ చేరుకోనుందని పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరం స్టేషన్ల మీదుగా రాకపోకలు కొనసాగించనున్నాయని తెలిపింది.

**( డెస్క్)**

-----------------------------------